

# పంపకం

**- యం.రమేష్‌కుమార్**





కథల పోటీలో ప్రోత్సాహక బహుమతి పొందిన కథ

"సావిత్రీ కాస్త కాఫీ తీసుకొస్తావా...?" భార్యని కేకేసి పేపర్లో తలదూర్చిన శివరామయ్యకు చప్పున స్ఫురణకొచ్చింది... సావిత్రి ఇక్కడ లేదు... అవును... అలవాట్లో పొరపాటు.

"అమ్మా వాణీ... కాఫీ తీసుకొస్తావా..." అనబోతూ మళ్ళీ ఆ మాటల్ని గొంతులోనే మింగేశాడు శివరామయ్య. టైమయితే తనే ఇస్తుంది. పిల్లల్ని స్కూల్‌కు తయారుజేయడంలో బిజీగా వుండి వుంటుంది. తను తొందర పెట్టడం సరికాదు అనుకొన్నాడు.

ఏమయినా భార్యను అడిగినంత ధాటిగా కోడల్ని ఎలా అడగగలడు? ఎందుకో ఒక్కసారిగా దిగులు ఆవరించినట్టుగా అనిపించిందాయనకు.

'మీ చిన్న కోడలు చంటి పిల్లాణ్ణి సరిగ్గా చూసుకోలేకపోతోంది. అమ్మ వుంటే వాడి సంరక్షణ సరిగ్గా చేస్తుందని' చెప్పి చిన్నకొడుకు సావిత్రమ్మని తీసుకెళ్ళిన దగ్గర్నుంచి ఆయనకు ఏమీ తోచకుండా వుంది. సావిత్రమ్మ అక్కడకు వెళ్ళి రెండు నెలలవుతోంది.

'చంటి పిల్లాణ్ణి తల్లి చూసుకోలేనంటే ఎట్లా? అయినా ఈవిడ అక్కడ ఎంతకాలం వుండిపోతుందో... ఏమిటో...?' చిన్నకొడుకు మాట పట్టుకొని అక్కడకు వెళ్ళి ఉండిపోయిన భార్యమీద కోపం వచ్చిందాయనకి.

అసలు ఇటీవల ఇంట్లో జరిగిన పరిణామాలేవీ శివరామయ్యగారికి నచ్చలేదు. తను, భార్య, పెద్దబ్బాయి హరి కుటుంబం, చిన్నోడు శ్రీధర్ కుటుంబం అంతా కలిసి ఈ ఇంట్లోనే వుండే వాళ్ళు. హరి ఓ ప్రయివేట్ ఫార్మశీ కంపెనీలో ఉద్యోగం చేస్తున్నాడు. చిన్నోడు రెవిన్యూ ఆఫీసులో జూనియర్ అసిస్టెంట్. గవర్నమెంట్ ఉద్యోగం. శివరామయ్య ఆప్కోలో పనిచేసి రిటైరయ్యాడు. అప్పట్లో పెన్షన్ విధానం లేకపోవడంతో ప్రస్తుతం ఆయనకు పెన్షన్ ఏమీ రాదు.

ఆయనకు ఉద్యోగం చేసే రోజుల్లో కూడా అత్తెసరు సంపాదన కావడంతో పిల్లల్ని చదివించడానికే ఇబ్బంది పడే పరిస్థితి ఉండేది. అయినా ఉన్నంతలో సర్దుకొని పొదుపుగా వుండి మొత్తంమీద ఓ చిన్న ఇల్లు కట్టగలిగాడు శివరామయ్య.

కొడుకులు ఉద్యోగాలు సంపాదించుకొన్న తర్వాత పెళ్ళిళ్లు కావడంతో కుటుంబం పెరిగింది. ఇల్లు ఇరుకైంది. రిటైర్మెంట్ తర్వాత ఆయనకొచ్చిన డబ్బుకు కొడుకులిద్దరూ తలా కొంత మొత్తం కలుపుకొని ఇంటిని రెండు గదులు వేర్వేరుగా వచ్చేలా రీమోడల్ చేయించారు.

శివరామయ్య తన రిటైర్మెంట్‌కు ముందే తన ఏకైక కూతురు, గారాలపట్టీ సుభద్రకు మంచి సంబంధం చూసి పెళ్ళి చెయ్యగలిగాడు. అయితే అందుకు కారణం సుభద్ర అందం, అదృష్టం అనే చెప్పుకోవాలి. అల్లుడు మధు బ్యాంకు ఉద్యోగి. అతను ఓ పెళ్ళిలో సుభద్రను చూసి ఇష్టపడ్డాడు. పట్టుబట్టి పెళ్ళిచేసుకొన్నాడు. దాంతో కట్నకానుకలివ్వాల్సిన అవసరం పెద్దగా లేకపోయింది. అప్పటికి సుభద్ర బియ్యేస్సీ ఫైనలియర్ రాసింది. ఇంకా చదువుతానని సుభద్ర పట్టుబట్టింది గానీ మంచి సంబంధం కావడంతో ఆమెకు నచ్చజెప్పి పెళ్ళిచేశారు. మధు చాలా మంచిమనిషి. నెమ్మదస్తుడు. తల్లిదండ్రులు మధు చిన్నవాడిగా ఉన్నప్పుడే చనిపోయారు. మేనమామ మధుని పెంచి పెద్దచేశాడు. మధు, సుభద్రల పెళ్ళయిన రెండేళ్లకు ఆయన కూడా కాలంచేశాడు.

శివరామయ్య తన రిటైర్మెంట్‌కు ముందే తన ఏకైక కూతురు, గారాల పట్టీ సుభద్రకు మంచి సంబంధం చూసి పెళ్ళి చెయ్యగలిగాడు. అయితే అందుకు కారణం సుభద్ర అందం, అదృష్టం అనే చెప్పుకోవాలి. అల్లుడు మధు బ్యాంకు ఉద్యోగి. అతను ఓ పెళ్ళిలో సుభద్రను చూసి ఇష్టపడ్డాడు. పట్టుబట్టి పెళ్ళిచేసుకొన్నాడు.

సుభద్ర విషయంలో తిరిగి చూడనవసరం లేని సంబంధం చెయ్యగలిగినందుకు శివరామయ్య ఆనందపడుతుంటాడు. రత్నాల్లాంటి ఇద్దరు పిల్లలు, ప్రేమించే భర్త, చింతలులేని సంసారంతో ప్రస్తుతం సుభద్ర హాయిగా వుంది.

అయితే శివరామయ్య ఇంట్లో ఈమధ్య కొన్ని మార్పులు వచ్చాయి. దానికి నాంది చిన్నకొడుకు శ్రీధర్‌కి విజయనగరం నుంచి పార్వతీపురం బదిలీ కావడం. అది తిరగ్గలిగే దూరం కాకపోవడంతో శ్రీధర్‌కి అక్కడకు వెళ్ళి ఉండక తప్పని పరిస్థితి ఏర్పడింది. మొదట ఒక్కడే వెళ్ళి కొన్ని రోజులున్నాడు. అయితే వంట రాకపోవడం, హోటల్ భోజనం పడకపోవడంతో ఇబ్బంది అయింది. దాంతో భార్యనీ, చంటిపిల్లాణ్ణి తీసుకెళ్ళక తప్పలేదు. అయితే ఈ క్రమంలో కొన్ని సంఘటనలు జరిగాయి.

శ్రీధర్ ఈ విషయంలో ముందుగా ఆలోచన చేశాడు. తను బైటికెళ్తున్నాడు. అద్దె ఇచ్చి ఇంకో ఇంట్లో ఉండక తప్పదు. అలాగని అన్నయ్య సొంత ఇంట్లో ఉంటున్నాడు కాబట్టి తన అద్దెలో సగం కట్టమని అడగలేడు... అందుకని ఇంటి విషయంలో ఓమాట అనుకుంటే బాగుంటుందేమో అనుకొన్నాడు. ఈ విషయం అన్నతో ఎలా చెప్పాలా... అని ఆలోచిస్తుండగా

ఇంటి వైద్యం

★ శొంఠి, తుంగముస్తలు (ముస్తకము) పిప్పళీ, శతపుష్ప నల్లకలువలు (నీలోత్పల) మొదలైన వాటిని మెత్తగా నూరి తలకు పట్టువేస్తే తలనొప్పి తగ్గుతుంది.

తమ్ముడి సందిగ్ధతని కనిపెట్టినట్టుగా హరే తమ్ముడితో ఇంటి విషయంలో ఓమాట అనుకొందామని అన్నాడు. ఈ విషయంలో హరి ఆలోచన అతడికి వుంది. తమ్ముడు ఈమధ్యే టౌన్ శివార్లలో తెలిసినవాళ్లు వెంచర్ చేశారని చెప్పి ఓ ప్లాటు తీసుకొన్నాడు. ఎప్పటికైనా ఇల్లుకట్టే ఆలోచనలో ఉన్నట్టుంది. గవర్నమెంట్ ఉద్యోగం కాబట్టి అతనికి హౌసింగ్ లోన్ తీసుకునే వెసులుబాటు ఉంది. తనది చూస్తే ప్రయివేటు ఉద్యోగం. స్థలం కొని ఇల్లు కట్టడం తనవల్ల అయ్యేలా కనిపించడం లేదు. అందుకే తాము ఉంటున్న ఈ ఇంటిని తను తీసుకొని, దీనికి రేటు కట్టించి అందులో సగం తమ్ముడికి చెల్లిస్తే సరిపోతుంది కదా అని హరి ఉద్దేశ్యం. దానికి ఇదే సరైన సందర్భమని అతడు భావించాడు.

అన్న ఆలోచనకి శ్రీధర్ కూడా ఒప్పుకున్నాడు. అతని ఆలోచన మరో విధంగా ఉంది. తనెలాగూ స్థలం తీసుకొన్నాడు. ఇంటికి రేటు కట్టించి అందులో సగం హరి తనకిస్తే, తాను మరికొంత లోన్ పెట్టుకొని ఆ స్థలంలో తను కోరుకొన్న విధంగా ఇల్లు కట్టించుకోవచ్చు. ఎలాగూ నాన్న ఖాళీగానే వున్నాడు కాబట్టి దగ్గరుండి ఇల్లు కట్టించే బాధ్యతను ఆయనకు అప్పగించవచ్చు. శ్రీధర్ ఆలోచనలు ఈ రకంగా సాగాయి.

ఇంట్లో వాళ్లందర్నీ ఓ రోజు కూర్చోబెట్టి ఈ నిర్ణయం చెప్పారు అన్నదమ్ములు. శివరామయ్య, సావిత్రమ్మలకి దీంట్లో కాదనడానికేమీ కనబడలేదు. ఆ రకంగా ఓ మాట అనుకున్నారు. ఇంటికి రేటు కట్టించాక తాను ఇంటిమీద లోన్ తీసుకునైనా సరే తమ్ముడికి ఇవ్వాల్సిన డబ్బు చెల్లిస్తానని చెప్పాడు హరి.

శివరామయ్య గారికి ఓ విషయం అర్థమైంది. ఆస్తి పంపకం అని పేరుపెట్టకపోయినా ప్రస్తుతం తమ కుటుంబంలో జరుగుతున్నది అదే! ఎందుకంటే తమకున్న ఏకైక స్థిరాస్థి ఇల్లు ఒక్కటే. అంతకుముందు తనకు వారసత్వంగా వచ్చిన ఆస్తులుకూడా ఏమీలేవు.

ఇప్పటివరకూ అంతా కలిసే వున్నారు. తామంతా ఒకే కుటుంబం అనే భావన ఉండేది. ఎప్పుడైతే ఆస్తి పంపకాలు పూర్తయి ఉమ్మడి అన్న భావన పోతుందో అప్పటినుంచి తమ కుటుంబం మధ్య అన్యోన్యత ఇంతకుముందులానే ఉంటుందా...? అని ఆయన అనుమానం. ఈ విషయంలో ఆయనకి మరో అసంతృప్తికూడా ఉంది. సుభద్ర పెళ్ళి సందర్భంగా అల్లుడికి తాము పెద్దగా ముట్టజెప్పిందేమీ లేదు. ఈ విషయంలో మధుకి అసంతృప్తి ఏమీలేకపోయినా తను



విజయనగరం జిల్లా నెల్లిమర్లలో పుట్టి, నెల్లిమర్ల, విజయనగరం, శ్రీకాకుళంలో చదివి, ప్రస్తుతం స్కూలు అసిస్టెంట్(మాథ్స్)గా ఉద్యోగం. వివిధ పత్రికల్లో పలు కథలు ప్రచురితమయ్యాయి. ఒక కథ హిందీలోకి అనువాదమైంది. వివిధ పత్రికలు నిర్వహించిన పోటీల్లో పలు బహుమతులు గెల్చుకోవడం సంతోషం కలిగించిన విషయాలు. కథలు రాయడం, చదవడం ఆనందాన్నిచ్చే సంగతులు.


**రచయిత చిరునామా:**

**యం.రమేష్‌కుమార్**

దేవాంగుల వీధి,

ఇం.నెం.26-160,

నెల్లిమర్ల- 535217 విజయనగరం జిల్లా.


మాత్రం రిటైర్మెంట్ అయ్యాక వచ్చే మొత్తంలో కొంత సుభద్రకిద్దామని అనుకొన్నాడు. ఆ విషయం కొడుకులతో కూడా చెప్పాడు. అయితే అప్పటికి కుటుంబం పెరగడం, ఇల్లు రీమోడల్ చేయించడం తప్పనిసరి కావడంతో ఆ అవకాశం లేకపోయింది. ఇప్పుడు ఇల్లు వాటాలువేసుకునే సమయంలో కూడా సుభద్ర గురించి కొడుకులిద్దరూ ఏమీ ప్రస్తావించకపోవడం ఆయన అసంతృప్తికి కారణం. అయితే ఆయన దాన్ని బైటపడనివ్వలేదు.

శివరామయ్యకి ఈమధ్య తరచూ భార్యకేసి మనసు మళ్ళుతోంది. సావిత్రి అక్కడికి వెళ్ళిన నెల తర్వాత ఓసారి పెద్దాడి దగ్గరకు వెళ్ళొస్తానంటూ ఇక్కడికొచ్చింది. నిజానికి అది తనమీద బెంగే అని ఆయనకి తెలుసు. పెళ్ళయ్యాక ఈ వయసువరకూ కూడా ఎప్పుడూ ఇన్ని రోజులు ఆయన సావిత్రిని వదిలి ఉన్నది లేదు. కాన్పుకి పుట్టింటికి వెళ్ళినప్పుడు కూడా కనీసం పది రోజులకొకసారి వెళ్ళి చూసి వస్తుండేవాడు. ఇన్ని రోజులు ఆవిణ్ణి చూడకుండా వుండడం ఇదే ప్రథమం.

అయితే సావిత్రి హరి దగ్గరకొచ్చి రెండురోజులన్నా కాకముందే అమ్మని రమ్మంటూ శ్రీధర్‌నుంచి ఫోన్లు. "నిజమేనండీ... ఇక్కడ మేము రాగిణికి పెద్దగా పనులు చెప్పేవాళ్లమే కాదు. అంతా నేను, వాణీయే చూసుకొనేవాళ్లం. మరిప్పుడు ఇల్లు చక్కబెట్టుకొని పిల్లాణ్ణి చూసుకోవాలంటే అలవాటయ్యేదాకా కష్టమే కదా..." అంటూ చిన్నకోడల్ని సమర్థించి ఈవిడ బైల్దేరి వెళ్ళిపోయింది. శివరామయ్యకు మాత్రం చిర్రెత్తుకొచ్చింది. 'నువ్వక్కడే వుండి పనులన్నీ చూసుకుంటూ వుంటే ఇంక ఆవిడకెప్పుడు అలవాటవుతుంది?' అన్నాడు గానీ సావిత్రమ్మ పట్టించుకోలేదు.

సావిత్రమ్మ లేకపోవడంతో శివరామయ్యకేమీ తోచడంలేదు. ప్రతి పనికీ తడుముకొంటున్నట్టుగా వుంది. 'ఈవిణ్ణి ఇంకా ఎన్ని రోజులక్కడ వుంచుతాడో వీడు...?' చిన్నకొడుకునుద్దేశించి అసహనంగా అనుకొన్నాడాయన.

పిల్లలకు వేసవి సెలవులు రావడంతో సుభద్ర ముందు చిన్నన్నయ్య ఇంటికి పార్వతీపురం వెళ్లింది. పిల్లలు చదువుతున్న కాన్వెంట్‌లోనే ఆమె టీచర్‌గా పనిచేస్తోంది. అందుకని పిల్లలకు సెలవులొస్తే ఆమెకూ సెలవులే...

శ్రీధర్ ఇంట్లో నాలుగురోజులున్న తర్వాత సావిత్రమ్మని వెంటబెట్టుకొని హరి దగ్గరకు వచ్చింది సుభద్ర.

ఇంటిని పంపకాలు చేసుకొన్నాగానీ సుభద్రకు ఏమీ ముట్టజెప్పలేకపోవడం పట్ల హరికి మనసులో కొంత ఇబ్బందిగానే వుంది. తండ్రి రిటైర్మెంట్ డబ్బునుంచి కొంత చెల్లెలికివ్వాలని అనుకొని ఇవ్వలేకపోవడం కూడా అతడికి గుర్తుంది.

సుభద్ర వున్న నాలుగురోజులూ సందడిగా గడిచిపోయాయి. 'అమ్మానాన్నల్ని నాతోపాటు తీసుకెళ్ళి నాల్రోజులు ఉంచుతాను. చిన్నన్నయ్యకు కూడా చెప్పాను'అని చెప్పి శివరామయ్య, సావిత్రమ్మలు 'ఇప్పుడెందుకమ్మా...'అంటున్నా వినకుండా తనతోపాటు తీసుకెళ్ళింది సుభద్ర.

నాలుగురోజుల తర్వాత 'అమ్మానాన్నల్ని ఎప్పుడు పంపిస్తున్నావమ్మా...' అంటూ సుభద్రకు ఫోన్ చేశాడు హరి.


'రెండ్రోజులు పోయాక వస్తార్లే...'అంటూ 'నిన్నో మాట అడగాలన్నయ్యా...' అంది సుభద్ర.


'ఏమిటమ్మా అది?' అడిగాడు హరి.

'ఇల్లు వాటాలు వేసుకున్నారు. సరే - మరి ఆ సందర్భంలో నేను గుర్తులేనా అన్నయ్యా...?' చెల్లెలు అడిగిన దానికి ఏమనాలో తోచక తబ్బిబ్బుపడి నవ్వేశాడు హరి.

'మీరేం అనకపోయినా మిమ్మల్ని అడిగి తీసుకునే హక్కు నాకుందనే అనుకొంటున్నాను... ఏమంటావన్నయ్యా...?' అడిగింది సుభద్ర.

(మిగతా 27వ పేజీలో)






ఇంటి వైద్యం

★ కుష్ఠ (చెంగల్వకోష్ఠు) ఏరండ మొలము (ఆముదం వేర్లు) శొంఠిలను మజ్జిగతో మెత్తగా నూరి తలపై లేపనం చేసిన తలనొప్పి తగ్గుతుంది.

(19వ పేజీ తరువాయి)

'ఇంతకీ నీకేం కావాలో చెప్పమ్మా...?' అడిగాడు హరి.

'ఫోన్లో చెప్పలేను గానీ ఓ ఉత్తరం రాస్తాను. నాకేం కావాలో అందులో రాస్తాను...' నవ్వుతూ అంది సుభద్ర.

'ఉత్తరమా...!'అని ఆశ్చర్యపడి 'సరేనమ్మా-' అన్నాడు హరి.

సుభద్ర మాటలు అతనికి అమితాశ్చర్యాన్ని కలిగించాయి. అతనికే కాదు వాణికీ, ఫోన్ ద్వారా సంగతి తెలుసుకొన్న శ్రీధర్, రాగిణిలక్కూడా అంతే ఆశ్చర్యం!!

'మావయ్యగారికి ఫోన్‌చేసి మాట్లాడి సంగతేమిటో కనుక్కొంటే బాగుంటుంది కదా...'అని వాణి చెప్పినా 'ఉత్తరం వచ్చాక చూద్దాంలే...'అంటూ దాటవేశాడు హరి.

చివరికి అంతా ఎదురుచూస్తున్న ఆ ఉత్తరం రానే వచ్చింది. ఆత్రంగా తెరిచి చూశాడు హరి.

అన్నయ్యకు,

సుభద్ర వ్రాయునది. అన్నయ్యా...నేను మొన్న చిన్నన్నయ్య దగ్గర్నుంచి మీ ఇంటికి రాగానే ఓ మాటన్నావు నువ్వు... గుర్తుందా...? 'నాన్న ఈమధ్య ఏమిటో పరాగ్గా ఉంటున్నారమ్మా... వేళకి భోజనం చేయాలన్న ధ్యాస కూడా ఉండటంలేదు. మందులు కూడా ఎన్నిసార్లు గుర్తుచేసినా మర్చిపోతున్నారు..' అన్నావు. అలా ఎందుకు ఉంటున్నారో ఏమైనా ఆలోచించావా...?

చిన్నన్నయ్య ఇంటి దగ్గర ఉన్న నాలుగురోజుల్లో నేను గమనించిందేమిటంటే అమ్మకూడా మునుపటంత హుషారుగా లేదని తను కూడా పరధ్యానంగా ఉండడం నా దృష్టిని దాటిపోలేదు.

అంతేకాదు... అక్కడ నాకింకో విషయం కూడా తెలిసి వచ్చింది. చిన్నన్నయ్య వదినతో అంటున్న మాటలు అనుకోకుండా నా చెవిన పడ్డాయి.

"అన్నయ్య మాత్రం అరకొర జీతంతో అమ్మానాన్నలిద్దర్నీ చూసుకోవాలంటే కష్టం కదా... అందుకని అమ్మని మనదగ్గిరే ఉంచుకొందాం. ఈమాట అన్నయ్యా, నేను ముందే అనుకొన్నాం. కాకపోతే 'నువ్వు శ్రీధర్ దగ్గరుండు' అని అన్నయ్య అమ్మతో అంటే బాగుండదు. కాబట్టి నువ్వు పిల్లాణ్ణి చూసుకోలేకపోతున్నావని వంకపెట్టి అమ్మని తీసుకొచ్చాను. ఇక నుండీ అమ్మ బాధ్యత మనదే..." అంటున్నాడు. ఆ మాటలు విని నేను తెల్లబోయాను. మీరు ఇంటినే కాదు... అమ్మానాన్నల్ని కూడా పంపకాలు చేసుకొన్నారన్న విషయం నాకర్థమైంది. పాపం... వాళ్ళకే ఇంకా ఈ విషయం అర్థంకాలేదు. పిచ్చి నాన్న... అమ్మ చిన్నన్నయ్య దగ్గర్నుంచి ఎప్పుడొచ్చేస్తుందా...అని ఎదురు చూస్తున్నాడు.

నీకోసం చిన్నన్నయ్యా, వాడికోసం నువ్వూ ఆలోచించి బాగానే ఒప్పందాలు చేసుకొన్నారు. కానీ మీరిద్దరూ అమ్మానాన్నకోసం ఆలోచించలేదా అన్నయ్యా...? ఈ వయసులో వాళ్ళిద్దర్నీ వేరుచేయడం సమంజసమేనా?



అమ్మానాన్నా మునుపట్లా ఇప్పుడెందుకు లేరో, చిరాగ్గా పరాగ్గా ఎందుకుంటున్నారో ఇంకా నేను చెప్పాలా అన్నయ్యా...? ఇప్పుడు వాళ్ళని చూస్తుంటే కలిసి ఉండటంకన్నా పెద్ద కోరికలేమీ వాళ్ళకు లేవని నా మనసుకు తెలుస్తోంది.

అమ్మని నిముషానికోసారి పిలవందే నాన్నకి తోచదనీ, అందులోనే ఆయన సంతృప్తి దాగుందని మీకు తెలీదా...? నాన్న చెప్పే పనులు చేసిపెడుతూ, ఆయన్ని ఆప్యాయంగా విసుక్కోవడంలోనూ, ఆయన బాగోగులు చూసుకోవడంలోనూ అమ్మ ఆరోగ్యం దాగుందని తెలీదా...? ఈ వయసులో ఒకరి దగ్గర ఒకరుండడం ఎంత అవసరమో... ఒకరి సాహచర్యం మరొకరికి ఎంత బలాన్నిస్తుందో మీకు తెలీదనుకోనా...?

అమ్మానాన్నా మునుపట్లా ఇప్పుడెందుకు లేరో, చిరాగ్గా పరాగ్గా ఎందుకుంటున్నారో ఇంకా నేను చెప్పాలా అన్నయ్యా...?

ఇప్పుడు వాళ్ళని చూస్తుంటే కలిసి ఉండటంకన్నా పెద్ద కోరికలేమీ వాళ్ళకు లేవని నా మనసుకు తెలుస్తోంది.

నాక్కావలసిందేమిటో చెప్తానన్నాను అదేమిటంటే మీరు అమ్మానాన్నల్ని కూడా పంచుకోదల్చేస్తే నా వాటాగా వాళ్ళిద్దర్నీ నాకిచ్చేయండి... నా దగ్గిరే వాళ్ళని పెట్టుకొంటాను. ఇది మీమీద కోపంతోనో లేక ఏదో ఆవేశంలోనో చెప్తున్న మాట కాదు. పూర్తిగా ఆలోచించే చెప్తున్నాను. దీనికి మీ బావగారి పూర్తి మద్దతు నాకు వుంది.

సంశయిస్తూనే నేను మీ బావగారి దగ్గర ఈ ప్రతిపాదన చేసినప్పుడు ఆయనెంతో సంతోషించారు. నిజానికి ఆయన్నించి ఈ ప్రతిస్పందన నేను ఊహించనిది! ఆయన ఒకటే అన్నారు...

"మీ అన్నయ్యలిద్దరూ ఒప్పుకొంటే నిజంగా నానుంచి ఎటువంటి అభ్యంతరం లేదు. పైగా అది నా అదృష్టంగా భావిస్తాను..." అంతేకాదు అమ్మానాన్నలకి కూడా ఆయనే ఈ విషయం చెప్పి 'మీ అబ్బాయిలు అంగీకరిస్తే నా మాట కాదనకూడదంటూ' ఒట్టు పెట్టించుకున్నారు కూడా.

అన్నయ్యా బావగారి సంగతి మీకు తెలుసు... తన వైపునుంచి ఆత్మీయ బంధువులెవరూ లేకపోవడం ఆయన్ని ఎంతో బాధిస్తోంది. పెంచి పెద్దచేసిన మేనమావ కూడా చనిపోయాక ఆయన మరీ బాధపడుతున్నారు. ఈ విషయంలో నేను ఎంత చెప్పినా ఆయన సమాధానపడలేకపోయారు. బహుశా అందుకే ఆయన నా ఈ ఆలోచనకు పూర్తి మద్దతునిచ్చారు. ఇంట్లో తమకంటూ పెద్ద దిక్కు ఉందని చెప్పుకోవడానికి ఆయన ఎంతో సంతోషంగా ఫీలవుతున్నారు. మీరు ఒప్పుకుంటారనే ఆయన కూడా ఆశపడుతున్నారు. నిర్ణయం ఇంక మీ చేతుల్లోనే ఉంది.

ఇద్దరు కొడుకులు ఉండి కూడా తల్లీతండ్రి కూతురి దగ్గర ఉంటున్నారని ఎవరైనా అనుకుంటారేమో అంటే నేనేం సమాధానం చెప్పలేను. మన గురించి తెలిసినవాళ్లు మనల్ని అర్థంచేసుకొంటే చాలు... అందరి గురించి ఆలోచించవలసిన అవరం మనకు లేదని నా నమ్మకం. పెళ్ళయిన తర్వాత ఫలానాది కావాలంటూ ఎన్నడూ మిమ్మల్ని కోరింది లేదు. ఈరోజు నేను అడుగుతున్న ఈ కోరికను కాదనరనే భావిస్తున్నాను.

ఈ విషయం గురించి చిన్నన్నయ్యతో మాట్లాడు... మీ నిర్ణయం కోసమే మేము ఎదురుచూస్తుంటాం... ఈ విషయాలన్నీ మీతో ముఖాముఖి చెప్పలేనేమో అని భయపడే ఉత్తరం ద్వారా తెలియజేస్తున్నాను.

మిమ్మల్ని నొప్పించే విధంగా ఏమైనా రాసి ఉంటే క్షమించమని కోరుతున్నాను. మీ నిర్ణయంకోసం ఎదురుచూస్తూ...


నీ ప్రియమైన చెల్లెలు
సుభద్ర.

చదవడం ముగించిన హరి మనసులో కల్లోల భావనా తరంగాలేవో వెల్లువెత్తాయి. ఉత్తరంలో వాక్యాలు కొన్ని అతడికి కనిపించని వాతలు పెట్టాయి. ఏదో అపరాధ భావం అతణ్ణి కొట్టుమిట్టాడేలా చేసింది.

సుభద్ర ఏం అడుగుతుందో అని ఒకింత ఆందోళనగా, మరోపక్క ఆసక్తిగా ఎదురుచూసిన అతడికి ఇప్పుడు తను అడిగిన దానికి ఎలా ప్రతిస్పందించాలో తెలీక ఆలోచిస్తూండిపోయాడు.

★






ఇంటి వైద్యం

★ అతిమధురము (యష్టిమధు) వత్సనాధి 125మి.గ్రా. కలిపి మెత్తగా నూరి దానిని పీలిస్తే తలనొప్పి తగ్గుతుంది.